క్లుప్తంగా

ఓటరు జాబితాపై స్పెషల్ క్యాంపెయిన్

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి నియోజకవర్గంలోని 271 పోలింగ్ కేంద్రాల్లో నేడు, రేపు ఓటరు జాబితాపై స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని రిటర్నింగ్ అధికారి, కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, జనవరి 01-2025 నాటికి 18 ఏండ్లు నిండిన నూతన ఓటర్లు ఓటుహక్కు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలు విధిగా స్పెషల్ క్యాంపెయిన్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

తిమ్మాజిపేట: పోలీసు కానిస్టేబుల్‌ను గాయపరిచి అసభ్యంగా మాట్లాడిన నాగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గుమ్మకొండ గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం గురించి తెలుసుకునేందుకు కానిస్టేబుల్ శరత్‌గౌడ్ వెళ్లాడు. ఈ క్రమంలో బావాజీపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఆటో నడపుతూ రోడ్డు పక్కకు వెళ్లి ఆపాడు. దీన్ని గమనించిన కానిస్టేబుల్ ఆటో డ్రైవర్‌తో ప్రయాణికులు ఉంటే ఇబ్బంది కదా అన్నాడు. దీంతో ఆటోడ్రైవర్ బూతులు తిట్టి కానిస్టేబుల్‌ను తోసేశాడు. దీంతో కానిస్టేబుల్‌కు గాయమైనట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన శ్రీహరి పత్తి ఏరేందుకు కూలీ పనికి వెళ్లాడు. ఇంటి దగ్గర ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తాళం, బీరువా తాళం విరగ్గొట్టి రూ.20వేల నగదు, ఇంటి ముందు పెంచుకుంటున్న 20 పావురాలను చోరీ చేశాడు. సాయంత్రం శ్రీహరి ఇంటికి రాగా పావురాలు కనిపించలేదు. ఇంట్లో బీరువా తెరిచి ఉండటంతో చోరీ చేసినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తెలకపల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన రాజేందర్‌గౌడ్ ట్రాక్టర్ డ్రైవర్ గణేష్ గురువారం రాత్రి తెలకపల్లి సమీపంలోని ఇండియన్ గోదాం వద్ద ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నాడు. దీంతో పోలీసులు తనిఖీ చేసి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ గణేష్‌పై ట్రాక్టర్ ఓనర్ రాజేందర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురియింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని బహుజన విద్యార్థి సమైక్య రాష్ట్ర నాయకులు కే రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రవేట్ కళాశాలలో విద్యార్థుల సమస్యలపై నిర్వహించిన సర్వేలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి, వెనుకబడిన విద్యార్థులకు ఆర్థికపరమైన ఇబ్బందులున్నాయని, ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సాయిబాబు, లక్ష్మన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకమిషన్ సభ్యుడికి సన్మానం

చారకొండ: తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యులుగా నియమితులైన చారకొండ వెంకటేష్‌ను శుక్రవారం వారి నివాసంలో గెస్టు లెక్చరర్స్ రాష్ట వర్కింగ్ ప్రసిడెంట్ సదానందం, మాజీ జెడ్పీటీసీ బాలస్వామిగౌడ్, నాయకులు కావలి కృష్ణ, భీమేశ్వర్, బాల్‌రాజులు ఘనంగా సన్మానించారు. ఈ ప్రాంతం నుంచి విద్యాకమిషన్ సభ్యులుగా అవకాశం ఇవ్వడంతో అభినందనలు తెలిపారు. కల్వకుర్తి, అచ్చంపేట ప్రాంతాల్లో పటిష్టమైన విద్యావ్యవస్థకు మార్పు తీసుకురావాలని కోరారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

పెద్దకొత్తపల్లి: ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల లే అవుట్లను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగశేషు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్లాట్ల డాక్యుమెంట్, ఈసీ జిరాక్స్‌లను గ్రామ పంచాయతీలో అప్పగించాలని సూచించారు. ఒక్కొక్క ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ కోసం రూ.19 వేలు స్టాంప్ డ్యూటీ అవుతుందని తెలిపారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయండి



పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వెల్దొండ రైతులు (ఫైల్)

- ఓ కంపెనీ పత్తి విత్తనాలతో దిగుబడి రానివైనం..
- ఆందోళన బాట పట్టిన రైతులు

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామ రైతులు ఖరీఫ్‌లో కోహినూర్ కంపెనీకి చెందిన తడాఖా వెరైటీని సాగు చేసి దిగుబడి లేక నష్టపోయారు. ఈ విషయమై గ్రామానికి చెందిన 80 మంది రైతులు 300 ఎకరాల్లో సాగు చేయగా నష్టం జరిగిందని వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు రైతులతో కోహినూర్ కంపెనీకి చెందిన ప్రతినిధులు శుక్రవారం జడ్చర్ల పట్టణంలో డీలర్లతో కలిసి చర్చలు నిర్వహించారు. ఈ చర్చల్లో కంపెనీకి చెందిన ప్రతినిధులు ఒక ప్యాకెట్‌కు రెండున్నర ప్యాకెట్లు రైతులకు ఇచ్చేలా రాజీ ప్రయత్నం చేశారు. వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం తడాఖా సాగు చేసిన రైతులకు ఎకరాకు 35 శాతం నుంచి 50శాతం వరకు నష్టం వాటిల్లినట్లు నివేదిక ఇచ్చారు. ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఒక ఎకరానికి దాదాపు 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా, తడాఖా సాగు చేసిన రైతులకు 4 క్వింటాళ్ల నుంచి 6 క్వింటాళ్ల వరకు తక్కువ దిగుబడి వచ్చిందని సీనియర్ రైతులు తెలిపారు. కానీ కంపెనీ ప్యాకెట్ ధరలను, పత్తి ధరల సగటుతో లెక్కిస్తే కంపెనీ ప్రతినిధులు ఒక క్వింటాలు పత్తికి ధర చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కొందరు రైతులు కంపెనీ ప్రతినిధులు చెల్లించే నష్ట పరిహారం వద్దని తిరస్కరించారు. తమకు జరిగిన నష్టంపై న్యాయ పరంగానే పోరాటం చేస్తామని మరి కొందరు రైతులు పేర్కొన్నారు. కంపెనీ ప్రతినిధులు తమను అవమానించారని వారు వాపోయారు. జరిగిన నష్టంపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు వివరించి న్యాయం జరిగేలా కోరుతామన్నారు.

రైతుల కోసమే కొనుగోలు కేంద్రాలు



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విండో సిబ్బంది

తాడూరు: రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని సింగిల్‌విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎట్టిదార్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ, తాలు లేకుండా ఉండేవిధంగా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, రైతులు రామస్‌గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, అర్జున్, రాములుగౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.



వెల్దండ మండలం బొల్లంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వెల్దండ: మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వరికొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బొల్లంపల్లిలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం రాములు, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు దానమ్మ, కార్యదర్శి అంజనమ్మ, సీసీ పాండు, రాములు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

కనుల పండువగా శిఖర ప్రతిష్ఠ



చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో శ్రీదాస ఆంజనేయ స్వామి దేవాలయంలో శిఖర చక్రకలశ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. లయోల, శ్రీ ఇందు విద్యాసంస్థల అధినేత రంగినేని వెంకట్‌రావు ఇందుమతి దేవాలయాన్ని పునర్ నిర్మాణానికి సహకరించారు. శుక్రవారం వెంకట్‌రావు ఇందుమతిలు శిఖర ప్రతిష్ఠ, కలశ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కృష్ణారావు, సుందర్‌రావు, రాజేశ్వర్‌రావు, భాస్కర్ రావు, కమాలాకర్ రావు, వెంకటరమణ రావు, శ్రీధర్ రావు పాల్గొన్నారు.

మానవ హక్కులను వినియోగించుకోవాలి

ఉప్పునుంతల: సమాజంలో ప్రతి ఒక్కరు తమ విధులను సక్రమంగా నిర్వహించి భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జాతీయ మానవ హక్కుల మండలి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనయ్య అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన మానవ హక్కుల మండలి సభ్యుల సమావేశంలో మాట్లాడారు. నేటి సమాజంలో అంతరించిపోతున్న మానవ హక్కులను కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మానవ హక్కులు, విధులు, చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం తహసీల్దార్ కేశవను, ఎంపీడీఓ మోహన్‌లాల్‌ను, ఏఈఓ మంజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల మండలి జిల్లా కార్యదర్శి పాత్కుల కొండల్, ఉపాధ్యక్షులు డాక్టర్ బాలుసాయిలు, జిల్లా కన్వీనర్ మేకల శేఖర్, అర్కపల్లి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జాతీయ మానవ హక్కుల మండలి జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనయ్య

మతతత్వ విధానాలను వ్యతిరేకిద్దాం

అచ్చంపేట రూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతతత్వ విధానాలను ముందుకు తీసుకొస్తోందని, వాటిని సీపీఎం వ్యతిరేకిస్తోందని జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. శుక్రవారం మండలంలోని సింగారంలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈనెల 24, 25 తేదీలలో అచ్చంపేటలో జిల్లా స్థాయి సీపీఎం మూడో మహాసభను నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని కోరారు. మల్లేష్, గోపాల్, నాగరాజు, బక్కయ్య, బుచ్చయ్య, సుందరయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కొల్లాపూర్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆయన కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికుల పక్షాన సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో వెంకటరమణ, శేఖర్, కృష్ణప్రసాద్, చిరంజీవి, కురుమయ్య, లక్ష్మి, చంద్రకళ, రాఘవేంద్ర, రాముడు, జాఫర్, శివమ్మ ఉన్నారు.

చిన్న పిల్లలను పనికి పంపొద్దు



పిల్లల తల్లిదండ్రులతో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు

మన్ననూర్: 'పిల్లలు బడిలో, పెద్దలు పనుల్లో' అన్న విషయాలను ప్రతి ఒక్కరు గమనించాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ సోషల్ వర్కర్ సృజన అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండలం మాచారం, వెంకటేశ్వర్లబావి గ్రామాల్లోని చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో పిల్లలను పొలం పనుల్లో, పత్తి తీయడానికో పంపి కూలీ డబ్బుల కోసం బడి మాన్పిస్తున్నారని తెలిపారు. తాత్కాలిక జీవన భృతి చూసుకొని పిల్లల బంగారు భవిష్యత్‌ను నాశనం చేయడం పద్ధతి కాదన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే విధంగా పిల్లలను బడికి పంపాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, చైల్డ్ ప్రొటెక్షన్ కోఆర్డినేటర్ మౌనిక, అంగన్‌వాడీ టీచర్ సాయిలమ్మ పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశ్యానాయక్, సభ్యులు బాలపీరు, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బాడిగదిన్నెలో మహిళ హెల్ప్‌లైన్ పోస్టర్లను విడుదల చేస్తున్న సీడీపీఓ వెంకటరమణమ్మ

కోడేరు: గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ వెంకటరమణమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని బాడిగదిన్నెలో గర్భిణీలు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపాలన్నారు. అనంతరం సఖీ సెంటర్ అధికారి సునిత మాట్లాడుతూ గృహహింస నుంచి బాధపడుతున్న మహిళలు సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న కౌన్సిలింగ్, రక్షణ, తాత్కాలిక వసతి, పోలీసు సహాయం, లీగల్ సలహాలు ఉచితంగా పొందవచ్చన్నారు. వారు రాలేని పక్షంలో 181, 9951940181కు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా ఉండాలని ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మహిళా హెల్ప్‌లైన్ పోస్టర్లను విడుదల చేశారు.

పుస్తకాల పంపిణీ



తాడూరు: రెండో వాచకం పుస్తకాలను శుక్రవారం ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆయా పాఠశాలలకు అందజేశారు. రెండో విడతగా వస్తున్న పుస్తకాలను పాఠశాలల హెచ్‌ఎంలకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. పాఠశాలల సిబ్బంది పుస్తకాలను తీసుకెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

చారకొండ: మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు ప్రధాన రహదారిపై రోడ్డు గుంతలుగా ఏర్పడి అస్తవ్యస్తంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను కోరడంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి గుంతల రోడ్డుకు మరమ్మతు చేయాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్‌గౌడ్, మండల అధ్యక్షులు బాల్‌రాం గౌడ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, మండల యూత్ అధ్యక్షులు గణేష్ ఉన్నారు.

టెట్ ఫీజు మినహాయించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు వికలాంగులకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని వికలాంగ సంఘం నాయకులు కోట్ల గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. టీటీసీ, బీఈడీ పూర్తి చేసి ఉపాధ్యాయ ఉద్యోగం కోసం తీవ్రంగా కష్టపడుతున్నట్లు పేర్కొన్నారు.

సీవీ రామన్ జయంతి

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని పాఠశాలలో సీవీరామన్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్‌క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్, క్లాస్‌మెట్‌క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు పోల శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అకిం విశ్వప్రసాద్, కోశాధికారి ఆంజనేయులు, కిరన్, జానయ్య, నరేష్, సభ్యులు మల్లేష్, లవకుమార్, దాత నాగార్జున పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ

కల్వకుర్తి టౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, తహసీల్దార్ ఇబ్రహీంతో కలిసి ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటరు నమోదుపై యువతలో విస్తృత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఓటు విలువ, కళాశాల నుంచి పాలమూరు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీపాద శార్వాణి, వైస్ ప్రిన్సిపల్ డా.వాణి, కళాశాల లెక్చలర్లు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



స్టిక్కర్ అంటించి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఇంటింటా తిరిగే సిబ్బందికి సరైన సమాచారం అందించి సహకరించాలని ఎంపీడీఓ బ్రహ్మాచారి తెలిపారు. 30వ తేదీ వరకు సర్వే జరుగుతుందని, ముందుగానే ప్రతి ఇంటికి స్టిక్కర్‌లను అంటించినట్లు తెలిపారు. మండలంలోని తుమ్మలసూరులో నిర్వహించిన సర్వేలో ఎంపీడీఓ, ఇన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కందిపంటకు సస్యరక్షణ చర్యలు

మన్ననూర్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కంది పంట కొంతమేరకు ఆశాజనకంగా ఉందని ఏఈఓ సీతారాం అన్నారు. శుక్రవారం ప్రశాంతి నగర్, మన్ననూర్ గ్రామాల్లో సాగు చేస్తున్న కందిపంటను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం కందిపంటను కాయతొలుచు పురుగు ఆశించినట్లు ఆయన గమనించారు. ఈ రకం పురుగు కాయలోపలికి వెళ్లి గింజలను తినేస్తాయని, దీంతో దిగుబడి తగ్గే అవకాశాలున్నాయన్నారు. వాటిని నివారించేందుకు రైతులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు, వేపనూనె ఒక లీటరు కలిపి ఎకరం పొలానికి ఉదయం లేదా సాయంత్రం పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, అజ్మత్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న ఏఈఓ సీతారాం, రైతులు

బీసీ కులగణనను వ్యతిరేకించొద్దు

నాగర్‌కర్నూల్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కుల గణను ఎవరు వ్యతిరేకించొద్దని, వ్యతిరేకించే పార్టీలు బీసీ ద్రోహులేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారి చారిత్రాత్మకంగా సమ గ్ర కులగణన జరుగుతోందని, కులగణనకు బేషర తీగా మద్దతు తెలుపాలని విజ్ఞప్తి చేశారు. కుల గణనపై బీజేపీ, బీఆర్ఎస్‌లు అనుకూలమా, వ్యతిరేక మా? స్పష్టం చేయకపోవడం సరైందికాదన్నారు. స మావేశంలో బీసీ సంఘం నాయకులు కుంభం మ ల్లేష్‌గౌడ్, రాజు, శివ, తిరుపతయ్య, మౌలానా, మధు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అర్హులందరికీ రుణాలు



సంఘ సభ్యుడిగా ఉన్న రైతు వీరారెడ్డికి పీఏసీఎస్ నుంచి రుణంగా ఇప్పించిన ట్రాక్టర్

- 2024-25లో రూ.5 కోట్లు దీర్ఘకాలిక రుణాలు

ఉప్పునుంతల: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో అర్హులైన సంఘ సభ్యులందరికీ దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందిస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావు తెలిపారు. శుక్రవారం సంఘ సభ్యుడిగా ఉన్న మండలంలోని కొరటికల్‌కు చెందిన జి వీరారెడ్డికి పీఏసీఎస్ నుంచి రూ.12 లక్షల రుణం మంజూరు చేసి ట్రాక్టరును ఇప్పించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ట్రాక్టర్లు, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, పౌల్ట్రీ ఫాం వంటి దీర్ఘకాలిక రుణాల కోసం రూ.5 కోట్లు మంజూరు కాగా, ఇప్పటికే కొంతమంది సభ్యులకు రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరి కొందరికి త్వరలోనే పంపిణీ చేస్తామని సీఈఓ రవీందర్‌రావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంఘంలోని కొత్త సభ్యులకు రూ.2 కోట్ల వరకు పంట రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు సాయిబాబు, కొత్త రవీందర్‌రావు, బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లింగాల: మండలంలోని శాయిన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేసిన హెచ్‌ఎం చందూనాయక్, ఉపాధ్యాయురాలు మౌనిక బదిలీపై వెళ్లగా, వారిని శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఇటీవల డీఎస్సీ ద్వారా పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు రఘురాం, రామును సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జరీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



నాగర్‌కర్నూల్‌లో కేక్ తినిపిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



మన్ననూర్ ఆలయం ప్రాంగణంలో రాగి చెట్టు నాటిన నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి నాయకులకు తిపించారు.

- తెలకపల్లిలోని నెహ్రూచౌరస్తాలో కేక్‌కట్‌చేసి బాణాసంచా కాల్చారు.
- కొల్లాపూర్‌లో టీపీసీసీ సభ్యులు రంగినేని జగదీశ్వరుడు పేదలకు దుస్తులు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు మిఠాయిలు పంచారు.
- వంగూరులో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు.
- మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో బాణాలు కాల్చి సంబురాలు చేశారు. ప్రధాన కూడలిలో మొక్క నాటారు.
- ఊరుకొండ పేటలోని శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయంలో, హజరత్ అమీనోద్దీన్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- వెల్దండ, పెద్దకొత్తపల్లి, వెనచర్ల గ్రామాల్లో కేక్‌కట్ చేశారు.



లింగాలలో సీఎం జన్మదిన వేడుకలు

- లింగాల, అంబట్‌పల్లి, అప్పాయపల్లిలో కేక్‌కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు.
- ఉప్పునుంతల మండలంలోని వెల్టూరులో గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు.
- కల్వకుర్తి మండలంలోని మార్చాలలో కేక్‌కట్‌చేసి బాణాసంచా కాల్చారు.
- అచ్చంపేట మండలం శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. సీఎం జన్మదిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.